క్లుప్తంగా

తాగునీటి ఇబ్బందులు రానివ్వం



ధరూరు: తాగునీటి సమస్యను అధిగమించేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు మార్లబీడు స్పెషల్ ఆఫీసర్ సురేష్ అన్నారు. శుక్రవారం ఆయన గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి పాత బోరులో ఉన్న మోటారును బయటకు తీయించి మరమ్మతు చేయించే పనులు చేపట్టారు. వేసవి ఎండల తీవ్రత పెరిగిన నేపథ్యంలో మిషన్ భగీరథ నీటితో పాటు బోర్లను కూడా అందుబాటులో ఉంచుతున్నట్లు ఆయన తెలిపారు. తాగు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని గ్రామస్తులకు సూచించారు.

ఇంటి పన్ను సకాలంలో చెల్లించండి

అయిజ: మున్సిపాలిటీలోని ప్రజలందరూ ఇంటిపన్ను సకాలంలో చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ సత్యబాబు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం ఇంటి పన్ను బకాయిలకు సంబంధించిన వడ్డీపై 90 శాతం రాయితీ కల్పించిందని, బకాయిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మార్చి నెలాఖరు వరకు మాత్రమే ఈ అవకాశం ఉంటుందని, ఏప్రిల్ నుంచి ఇంటిపన్నుతో పాటు బకాయిపై పూర్తి స్థాయిలో వడ్డీ కూడా చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

పశువులకు టీకాలు



అయిజ: పశువుల్లో థైలెరియోసిస్ వ్యాధి రాకుండా అరికట్టేందుకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న టీకాలను వేయించాలని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపరాణి సూచించారు. శుక్రవారం మండలంలోని ఉత్తనూరు గ్రామంలో 113 పశువులకు వెటర్నరీ సిబ్బంది వ్యాక్సిన్ వేశారు. ఈసందర్భంగా స్వరూపరాణి మాట్లాడుతూ పశుపోషకులకు ఎలాంటి అనుమానాలున్నాసరే పశువుల ఆస్పత్రిలో సిబ్బందిని సంప్రదించి, వివరాలు తెలుసుకోవాలని సూచించారు.

గమ్యానికి చేరకుండానే..

- గుండెపోటుతో డ్రైవర్ మృతి

ఎర్రవల్లిచౌరస్తా: ఓ డ్రైవర్ గుండెపోటుతో మృతిచెందిన ఘటన ఇటిక్యాల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేష్ కథనం ప్రకారం.. బెంగళూర్‌కు చెందిన డ్రైవర్ కుమార (50) బొలెరో వాహనంతో శుక్రవారం హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో రాత్రి 44వ జాతీయ రహదారిపై ఎర్రవల్లి చౌరస్తాకు రాగానే ఒక్కసారిగా ఎదలో నొప్పి రావడంతో వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి కూడలిలోని ఓ ఆర్ఎంపీ డాక్టర్‌ను సంప్రదించేందుకు వెళ్లాడు. అక్కడే ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయాడు. విషయం తెలుసుకున్న ఆర్ఎంపీ సీపీఆర్ చేసి హుటాహుటినా ప్రైవేట్ వాహనంలో స్థానికులు, పోలీసుల సహాయంతో గద్వాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా డ్యూటీ డాక్టర్ పరిశీలించి అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా కుమార సభ్యులకు సమాచారం అందించి మృతదేహాన్ని గద్వాల ప్రభుత్వాస్పత్రిలో ఉంచినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రంజాన్ మాసం ముస్లింలకు పవిత్రమైంది



ఆత్మకూర్: పవిత్ర రంజాన్ మాసం ఎంతో ప్రాముఖ్యతతో కూడుకున్నదని, ఇదే మాసంలో దివ్యఖురాన్ అవతరించిందని ముఫ్తీ సయ్యద్ ఇబ్రహీం ఖాస్మీ, మౌలానా అబ్దుల్ రహ్మాన్ అన్వరి, మౌలానా అబ్దుల్‌అలీం అన్నారు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజామున వరకు పట్టణంలోని మస్జిదే నూర్‌లో పవిత్ర రంజాన్ మాసం స్వాగతోత్సవం సందర్భంగా ధార్మిక సదస్సు నిర్వహించారు. రంజాన్ మాసంలో 30 రోజుల పాటు చేపట్టే ఉపవాసాల వల్ల పుణ్యంతో పాటు ఎన్నో రకాల లాభాలు ఉన్నాయని, రోగాలన్నీ నయమవుతాయన్నారు. రంజాన్ మాసంలో తమ వద్దనున్న సంపదలో 25 శాతం జకాత్ రూపంలో దానధర్మాలు చేయాలని, నిరుపేదలకు అండగా నిలువాలని ఆహార పదార్థాలతో పాటు దుస్తులను సమకూర్చాలని కోరారు. ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహువలై వసల్లం సూక్తులను పాటించాలని, తల్లిదండ్రులను గౌరవించాలని, ప్రతినిత్యం ఐదుపూటలు నమాజ్ ఆచరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హాఫీజ్ జియాఉర్ రహ్మాన్ ఫహీమ్, హాఫీజ్ ముక్తదీర్, హాఫీస్ రఫియొద్దీన్, హాఫీజ్ ఫక్రుద్దీన్, నిర్వాహకులు షబ్బీర్, కలీం, వాహీద్, అమీర్, ఖమ్రుద్దీన్, నవీద్, మహిమూద్ తదితరులు పాల్గొన్నారు.



అమరవాయిలో కల్యాణోత్సవం



ధరూరులో..



మాల్‌దొడ్డిలో..

పరమ శివా.. పాహిమాం

సాక్షినెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం మహాశివరాత్రి పురస్కరించుకుని గ్రామాలు, పట్టణాలు, మండల కేంద్రాల్లోని శివాలయాలు భక్తజనంతో కిక్కిరిశాయి. బుర్ధపేటలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ దంపతులు పూజలు నిర్వహించారు.

ఉండవెల్లి మండల పరిధిలో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త దామోదర్ రెడ్డి, అర్చకులు ఆంజనేయ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

- అయిజ పరిధిలో వివిధ గ్రామాల్లో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను ఎద్దుల బండిపై ఊరేగించారు. శివ భక్తులు శ్రీశైలంలోని స్వామివారిని దర్శించుకునేందుకు మండల కేంద్రం నుంచి బయలుదేరారు
- రాజోళితో పాటు ఆయా గ్రామాల్లో శుక్రవారం శివరాత్రి వేడుకలు నిర్వహించారు. భ్రమరాంబ అడివేశ్వర స్వామి ఆలయంలో, తుంగభద్ర నది మధ్యలో ఉన్న రాంపాటి శివాలయంలో శివుడికి అర్చనలు అభిషేకాలు చేశారు.
- మానవపాడు పరిధిలో రుద్రాభిషేకాలు, అర్చనలు ఘనంగా నిర్వహించారు.
- కేటీదొడ్డి మండల కేంద్రంలోని శివాలయంతో పాటు కుచినెర్లలో అడివిస్వామి తదితర ఆలయాల్లో వేడుకలు ఘనంగా సాగాయి. ముఖ్య అతిథిగా జెడ్పీ చైర్‌పర్సన్ సరిత హాజరై పూజలు నిర్వహించారు. ఆలయ పరిధిలో అన్నదానం చేపట్టారు. నాయకులు మధుసూదన్‌బాబు, శ్రీనువాసులు తదితరులు ఉన్నారు.



కేటీదొడ్డిలో పూజల్లో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

- గట్టు బస్టాండు ఆవరణలోని శివాలయంలో ధర్మకర్త ఆరగిద్ద జయమ్మ, నారాయణశెట్టి దంపతుల కుమారులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. బంగారు బసవేశ్వర దేవాలయం, వీరభద్ర స్వామి దేవాలయాల్లో వేడుకలు ఘనంగా జరిగాయి.
- మల్దకల్ పరిధిలోని అమరవాయి, బిజ్వారం, ఎల్కూరు, కుర్తిరావులచెర్వు, తాటికుంట, శేషంపల్లి గ్రామాల్లోని శివాలయాల్లో శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించారు. నాయకులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.
- ధరూరు పరిధిలో మార్లబీడు, మాల్‌దొడ్డి, పారుచర్ల, ర్యాలంపాడు, చింతరేవుల, అల్వలపాడు గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.
- వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్‌లో వెలసిన స్పటిక లింగేశ్వరస్వామి ఆలయంలో, జూలెకల్ సమీపంలో వెలసిన మల్లికార్జునస్వామివారి ఆలయంలో, మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.
- ఎర్రవల్లి మండల కేంద్రంలోని శివాంజనేయ స్వామి ఆలయంలో మహా శివరాత్రిని పురస్కరించుకొని శుక్రవారం శివపార్వతుల కల్యాణంను వైభవంగా నిర్వహించారు.



ఉండవెల్లిలో..



చెన్నిపాడు శివుడికి పూజలు



బుర్ధపేటలో శివలింగానికి అభిషేకం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ కేశవ్ దంపతులు



గట్టులో..



తుమ్మలపల్లెలో..



అయిజ గుంతరామలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు



అయిజలో ఊరేగింపు

చింతలకుంటలో వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠాపన



వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

కేటీదొడ్డి: మండలంలోని చింతలకుంటలో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్పీచైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, రాష్ట్ర వినియోగదారుల ఫోరం మాజీ చైర్మన్ గట్టు తిమ్మప్ప, నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగ్లల్ల రంజిత్‌కుమార్ హాజరై పూజలు చేశారు. ఈ సందర్భంగా అంకురార్పణ, హోమం, మహాపూర్ణాహుతి నిర్వహించి మహిళలు హారతులతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గట్టు జెడ్పీటీసీ బాసు శ్యామల, హనుమంతు నాయుడు, జెడ్పీటీసీ రాజశేఖర్, వైస్ ఎంపీపీ రామకృష్ణనాయుడు, వాల్మీకి జిల్లా నాయకులు రమేష్‌నాయుడు, వైడింగ్ రాములు, మధుసూదన్‌బాబు, కోటేష్, రామాంజనేయులు, వాల్మీకి మండల అధ్యక్షుడు టీచర్ గోవిందు, తాయప్ప, ధనుంజయ్, రంగప్ప తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌రావు వ్యాఖ్యలపై ఉద్యోగుల నిరసన

గద్వాల: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల జీతాల చెల్లింపుపై మాజీ మంత్రి హరీష్‌రావు అవమానకరంగా మాట్లాడారని ఉద్యోగులు మండిపడ్డారు. హరీష్‌రావు వ్యాఖ్యలను నిరసిస్తూ శుక్రవారం సాయంత్రం స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్లకార్డులు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. మాజీ మంత్రి హరీష్‌రావు, బీఆర్ఎస్ నేతలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ హరీష్‌రావు తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకొని, బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ, టీపీఆర్టీయూ, టీటీయూ, సీపీఎస్ సంఘాల నాయకులు బుచ్చన్న, వేణుగోపాల్‌రెడ్డి, తిమ్మప్ప, రఘు, భరత్‌కుమార్, యూనిస్‌పాష, లక్ష్మణ్, శ్రీహరి, శంకర్ నాయక్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు

రోడ్లపైనే మురుగు



మానవపాడు: మండలంలోని బోరవెల్లిలో రోడ్లపై మురుగు పారుతోంది. చాలా ఏళ్లుగా సమస్యలను ప్రజాప్రతినిధులకు, అధికారులకు చెబుతున్నా చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. డ్రెయినేజీలు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని రోడ్లపై మురుగు పారకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

శాంతినగర్ సీఐగా రత్నం



శాంతినగర్: శాంతినగర్ సర్కిల్ సీఐగా రత్నం శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీలో భాగంగా గతంలో పని చేసిన సీఐ ఇటీవల బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రత్నం ను నూతన సీఐగా నియమించారు.

ప్రవీణ్‌కుమార్‌ను విమర్శిస్తే సహించం

రాజోళి: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను విమర్శించే హక్కు ఎవరికీ లేదని ఎమ్మార్పీస్ నాయకులు అన్నారు. శుక్రవారం మాన్‌దొడ్డిలో వారు మాట్లాడుతూ.. మంత్రి కొండా సురేఖ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పట్ల మాట్లాడిన తీరు సరికాదని, ఆయనను విమర్శిస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ప్రతి విద్యార్థికి మెరుగైన విద్య అంది, వారు ఉన్నత స్థానాల్లో ఉండాలని ఆశించిన మహోన్నత వ్యక్తి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అని, అలాంటి వ్యక్తిని విమర్శించిన కాంగ్రెస్ నాయకులు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయనకు క్షమాపణ చెప్పకపోతే ఎమ్మార్పీఎస్ తరఫున నిరసనలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో నవీన్ కుమార్, కిరణ్ కుమార్, దేవన్న తదిదరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మార్పీస్ నాయకులు

కనులపండువగా రథోత్సవం



తేరు లాగుతున్న భక్తులు

ధరూరు: మండలంలోని కోతులగిద్ద అరణ్ణేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రెండు రోజులుగా జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి స్వామివారి రథోత్సవం, శివపార్వతుల కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. ఈ కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్‌పర్సన్ బండ్ల లక్ష్మదేవమ్మ ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అంతకు ముందు నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగ్లల్ల రంజిత్ కుమార్ స్వామివారి రథం వద్ద పూజలు చేశారు. ఆలయ ప్రాంగణమంతా శివనాస్మరణతో మార్మోగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, మాజీ సర్పంచులు రంగన్న, రంగప్ప, నాయకులు జంగిలప్ప, కేబీ గోవిందు, రంగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలి



గద్వాల బీసీ బాలికల వసతిగృహంలో..

అలంపూర్: మహిళలకు కల్పించిన 33 శాతం రిజర్వేషన్లు తక్షణమే అమలు చేయాలని సమ సమాజ సేవా ట్రస్టు సభ్యులు డిమాండ్ చేశారు. పట్టణంలోని గురుదేవ్ పాఠశాలలో సమ సమాజ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ట్రస్టు ప్రధాన కార్యదర్శి నాగరాజు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ కళాశాల హాస్టల్ వార్డెన్ షరీఫను శాలువాతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మహిళలకు పని ప్రదేశంలో మెరుగైన సౌకర్యాలు, వేతనాల పెంపు, దీర్ఘకాలిక పని గంటలు తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో ఏమేలమ్మ, నాగరాజు, రమేష్, జాన్సన్, రాజు, ఆశన్న, బాబు తదితరులు ఉన్నారు.

గద్వాల అర్బన్: చైతన్య మహిళ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ జ్యోతి మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలు, అసమానత్వం, అణిచివేత, అభద్రత తదితర సమస్యలను రోజురోజుకూ పెరిగాయని, వాటి నివారించేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు జయమ్మ, జిల్లా కార్యదర్శి రేవతి, సభ్యులు లక్ష్మి, పావని, వెంకటమ్మ తదితరులు ఉన్నారు.

మాచర్లలో..

గట్టు: తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ ఆధ్వర్యంలో మాచర్లలో మహిళలు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కోఆర్డినేటర్ నర్సింహులు, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి లావణ్య, గ్రామ సంఘం అధ్యక్షురాలు శృతి, ఈదమ్మ, రజిత, జయమ్మ, భాగ్యమ్మ, గోపాల్, ఆదాం, రాజు, స్వామి, ఆనంద్, హనుమంతు, వీరేష్, శివరాజు, బాస్కర్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

అయిజ: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య మహిళా సిబ్బందికి మండల కేంద్రంలోని బ్రహ్మారెడ్డి ఆస్పత్రి నిర్వాహకుడు డా.అబులేష్ చీరలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల్లో ఎక్కువ శాతం మహిళలు పనిచేస్తున్నారని, వారి వల్లనే పట్టణం పరిశుభ్రంగా ఉందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ తాహేర్, డాక్టర్ అబుల్ ఫజల్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ దినోత్సవం

ఉండవెల్లి: మండలంలోని కంచుపాడు రైతువేదికలో మహిళ దినోత్సవాన్ని వీఎస్‌టీ కంపెనీ అనుబంధ గ్రామాలయ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రామచంద్రన్, జాకీర్ హుస్సేన్, నసీమా బేగం, పర్వీన్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అయిజలో..



కంచుపాడులో..



మాచర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

రోడ్డుపై మలుపులతో ప్రమాదం



మానవపాడు నుంచి జాతీయ రహదారికి వెళ్లే రోడ్డుపై మలుపు

మానవపాడు: ప్రధాన రోడ్లపై మలుపులు ప్రమాదాలకు శాపంగా మారుతున్నాయి. మలుపుల్లో ఎదురుగా వచ్చే వాహనాలను గమనించక వాహనదారులు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. మండలంలోని జాతీయ రహదారి నుంచి మానవపాడు డీ–31 జూరాల కాల్వ వద్ద ఉన్న మలుపులో సూచిక బోర్డు కూడా లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కాల్వ వంతెనను ఎత్తు పెంచాలని మండల ప్రజలు కోరుతున్నారు. గతంలో ఇక్కడ ప్రమాదాలు జరిగి పులువురు గాయపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.